పెండింగ్ డీఏలు విడుదల చేయాలి: టీఎన్జీవో

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల పెండింగ్ డీఏలు విడుదల చేయాలని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై మంగళవారం సచివాలయంలో సీఎస్ శాంతికుమారికి వినతిపత్రం అందజేశారు. స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని, ఏపీ నుంచి వచ్చిన తెలంగాణ ఉద్యోగులకు పోస్టింగ్ ఇచ్చి వేతనాలు చెల్లించాలని, పెండింగ్ డీఏలు, జీవో 317ను పునఃసమీక్షించాలని, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో కేంద్రసంఘం సహా అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, నగరశాఖ అధ్యక్షుడు శ్రీకాంత్, కార్యదర్శి పంతులు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యతపై రాజీపడొద్దు: సీతక్క

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ) : గ్రామీణ రోడ్ల పనుల్లో నాణ్యతపై రాజీ పడొద్దని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం ఎర్రమంజిల్ పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో ఇటీవల నియామక పత్రాలు అందుకున్న ఏఈఈలకు శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి సీతక్క ప్రారంభించి ప్రసంగించారు. రూ. 1375 కోట్లతో గ్రామీణ రహదారులను నిర్మిస్తున్నామని, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖలో త్వరలో 500 కు పైగా కారుణ్య నియామకాలను చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈఎన్‌సీ కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

మంథని ఆర్డీవో సరెండర్

అవినీతి ఆరోపణల నేపథ్యంలో సీసీఎల్ఏకు పంపిన కలెక్టర్

హనుమానాయక్

మంథని, అక్టోబర్ 15 : పెద్దపల్లి జిల్లా మంథని ఆర్డీవో హనుమానాయక్‌ను హైదరాబాద్‌లోని భూపరిపాలన ప్రధాన కమిషనరేట్‌కు సరెండర్ చేస్తూ కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిధుల దుర్వినియోగం, నేషనల్ హైవే అథారిటీ, భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్‌తోపాటు సాధారణ ఫిర్యాదులకు హాజరుకావడంలో నిర్లక్ష్యం వహించడం, ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో ఆలస్యం, కోర్టు ఆదేశాలను పాటించడంలేదని పేర్కొంటూ హనుమానాయక్‌ను సరెండర్ చేశారు. కాగా పెద్దపల్లి ఆర్డీవో గంగయ్యకు మంథని ఆర్డీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

నీటి సంరక్షణపై మూడంచెల కమిటీ

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర వ్యాప్తంగా నీటి సంరక్షణ, నీటి వినియోగ నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేస్తూ మంగళవారం మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. నీటి సంరక్షణపై చర్యలు తీసుకోవాలని మార్చి 13న హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఈ కమిటీలను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. రాష్ట్ర స్థాయి కమిటీ ప్రధానంగా వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాలు పెంపొందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై విధానాలను రూపొందించాలని, నీటి సంరక్షణ చట్టాలను బలోపేతం చేయడానికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని, కేంద్ర ప్రభుత్వరంగ నీటి సంరక్షణ సంస్థలో సమన్వయం చేసుకొని వారి సాంకేతిక, ఆర్థిక సహకారం తీసుకోవాలని సూచించారు. నీటి సంరక్షణపై నిత్యం పర్యవేక్షించడానికి రాష్ట్ర స్థాయిలో సెంట్రలైజ్డ్ మానిటరింగ్ సిస్టమ్, జిల్లా, జీహెచ్ఎంసీ స్థాయి కమిటీలపై సమీక్ష చేయాలని తెలిపారు. జీహెచ్ఎంసీ స్థాయి కమిటీ రాష్ట్ర స్థాయి కమిటీకి ప్రతి మూడు నెలలకు ఒకసారి నివేదికను అందించాల్సి ఉంటుందన్నారు.

రెరా అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు 33 పోస్టులు

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ) : రెరా అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు 33 పోస్టులను మంజూరు చేస్తూ మంగళవారం ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఆదేశాలు జారీచేశారు. ఈ పోస్టులను భర్తీ చేసే బాధ్యత మున్సిపల్ శాఖకు అప్పగించింది. కొన్ని నెలల క్రితం రెరా అప్పిలేట్ ఆథారిటీని ఏర్పాటు చేసింది. ట్రిబ్యునల్ నిర్వహణకు అవసరమైన సిబ్బంది పోస్టులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో ట్రిబ్యునల్ వ్యవహారాలు ముందుకు సాగడంలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి పోస్టులను మంజూరు చేసింది.

పత్రికా స్వేచ్ఛకు కాంగ్రెస్ సమాధి

- 'నమస్తే' కథనంపై అధికార పార్టీ నేతల అక్కసు
- గోదావరిఖని చౌరస్తాలో ప్రతుల దహనం
- మండిపడుతున్న జర్నలిస్టులు, మేధావులు

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని చౌరస్తాలో నమస్తే తెలంగాణ దినపత్రికను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గోదావరిఖని, అక్టోబర్ 15: వాస్తవాలను బయటపెడుతున్న పత్రికపై కాంగ్రెస్ నేతలు అక్కసు వెళ్లగక్కారు. పత్రికా స్వేచ్ఛకే సమాధి కట్టారు. నిజానిజాలపై ప్రజలకు సమాధానం చెప్పకుండా.. ఏకంగా పత్రికలనే దహనం చేసే కొత్త సంస్కృతికి తెరలేపారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు 'నమస్తే తెలంగాణ' ప్రతులను దహనం చేయడంపై అటు జర్నలిస్టులు, ఇటు మేధావులు మండిపడుతున్నారు. వాస్తవం ఏంటంటే.. 'నమస్తే తెలంగాణ'లో ఈ నెల 15న 'అభివృద్ధి పనుల జాడేది?' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. గోదావరిఖని కల్యాణ్‌నగర్‌లో గత ఆగస్టులో మంత్రి చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ మాత్రం పనులు చేపట్టకపోవడంతో అక్కడి వ్యాపారులు నిత్యం దుమ్మూ ధూళితో నరకయాతన అనుభవిస్తున్నారు. ఇదే కోణంలో వ్యాపారుల అభిప్రాయాలను ఉటంకిస్తూ పత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధ్యతగా ప్రజలకు సమాధానం చెప్పకపోగా.. పత్రికా ప్రతులనే గోదావరిఖనిలో దహనం చేసి సమాజానికి ఏం సంకేతం ఇచ్చారో అర్థం కావడం లేదు. కాంగ్రెస్ నాయకుల వ్యవహార శైలిపై అటు జర్నలిస్టులు, ఇటు మేధావులతోపాటు ఆ పార్టీలోని నాయకులు, కార్యకర్తలు కూడా విస్మయం వ్యక్తంచేశారు. వ్యాపారుల విజ్ఞప్తి మేరకే దసరా పండుగ వరకు పనులను తాత్కాలికంగా నిలిపివేశారంటూ కాంగ్రెస్ కార్పొరేటర్లు చెప్తూనే మరోవైపు నిరసన చేపట్టడం గమనార్హం. స్థానిక ఎమ్మెల్యే రామగుండానికి రూ.400 కోట్ల నిధులు తీసుకొచ్చారని చెప్పుకొచ్చారు. నిజానికి ఆ కథనంలో స్థానిక ఎమ్మెల్యే గురించి ఎలాంటి విమర్శలు కూడా లేవు. కానీ.. కాంగ్రెస్ నాయకులు మాత్రం 'గుమ్మడికాయ దొంగ' చందంగా వ్యవహరిస్తున్నారని ప్రజాసంఘాల నాయకులు బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.

ఇదేం సంస్కృతి?

ఈరోజు 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో వచ్చిన వార్తలో ముమ్మాటికీ వాస్తవికత ఉన్నది. అక్కడి వ్యాపారులు చాలా రోజులుగా ఇబ్బంది పడుతున్నారు. నా దృష్టికి కూడా తీసుకొచ్చారు. వ్యాపారుల అభిప్రాయాలకు సమాధానం చెప్పకుండా.. పత్రికను దహనం చేయడం ఏంటి? ఇదెక్కడి సంస్కృతి? జర్నలిస్టులను అవమానపరచడమే. ప్రశ్నించే గొంతుకలను నొక్కాలని చూస్తే మేం చూస్తూ ఊరుకోం.

–కోరుకంటి చందర్, రామగుండం మాజీ ఎమ్మెల్యే

పత్రికలను గౌరవించే వ్యక్తిత్వం లేదా?

ప్రశ్నించే గొంతుకలను నొక్కుతారా? ఈ సంస్కృతి ఎక్కడైనా ఉన్నదా? వాస్తవాలను ప్రచురించిన పత్రికను తగలబెట్టి మీరు సమాజానికి ఏం సంకేతం ఇస్తున్నారు? నిజానికి ఆ వార్త ఒకటి.. మీ ఆరోపణ మరొకటి. రామగుండానికి రూ.400 కోట్లు తీసుకొచ్చామని చెప్తున్నారు. వాటి మీద శ్వేతపత్రం విడుదల చేయండి. ఈ తొమ్మిది నెలల కాలంలో ఎక్కడ అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయో ఒకసారి చూపించండి. అసలు పేపర్లో వచ్చిన వార్తను కనీసం గమనించారా? ప్రజలకు సమాధానం చెప్పాల్సింది పోయి.. పత్రికలను దహనం చేయడం ఏంటి? రేపు ఇంకో పత్రికలో వార్త వస్తది తగలబెడతారా? ఇది ముమ్మాటికీ పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించినట్లే.

–కౌశిక హరి, బీఆర్ఎస్ నాయకుడు

వారసత్వ ఉద్యోగాలు ఇంకెప్పుడు?

- ఎన్నికలకు ముందు కాంగ్రెస్ హామీ
- 10 నెలలవుతున్నా పట్టించుకోరేం?
- వీఆర్ఏ జేఏసీ కన్వీనర్ రాములు
- ప్రజాభవన్‌లో వీఆర్ఏల ఆందోళన

ప్రజాభవన్ వద్ద ఆందోళన చేస్తున్న వీఆర్ఏల వారసులు

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): వీఆర్ఏల వారసులకు ఇంకెప్పుడు ఉద్యోగాలు ఇస్తారని వీఆర్ఏ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వంగూరు రాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో వీఆర్ఏలు, వారి వారసులు ఆందోళనకు దిగారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన వీఆర్ఏలు ప్రజాభవన్‌లో బైఠాయించారు. ఈ సందర్భంగా వంగూరు రాములు మాట్లాడారు.వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ పేస్కేల్, 61 ఏండ్లు దాటినవారి వారసులకు ఉద్యోగాలు ఇస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో నం.81, 85 విడుదల చేసిందని చెప్పారు. ఈ మేరకు వీఆర్ఏల్లో డిగ్రీ చదివిన వారికి జూనియర్ అసిస్టెంట్‌గా, ఇంటర్ చదివిన వారికి రికార్డ్ అసిస్టెంట్లుగా, పదో తరగతి చదివిన వారికి ఆఫీస్ సబార్డినేట్లుగా వివిధ శాఖల్లో ఉద్యోగాలు ఇచ్చిందని వివరించారు. 61 ఏండ్లకు పైబడిన 3,797 మంది వారసులకు ఉద్యోగాలు ఇస్తామని జీవోలో ఆనాటి ప్రభుత్వం స్పష్టంగా చెప్పిందని పేర్కొన్నారు. ఇదే విషయమై ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇతర నేతలు తమకు అనుకూల హామీలు ఇచ్చారని చెప్పారు. ఇప్పుడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ వారసులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని విమర్శించారు. వీఆర్ఏల సమస్యల పరిష్కారం కోసం సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీ వేసిందని గుర్తుచేశారు. ఈ కమిటీ నివేదిక ఇచ్చి నెలలు గడుస్తున్నా అమలు చేయడమే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం, మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్న ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య హామీతో వారు ఆందోళన విరమించారు.కార్యక్రమంలో సాగర్, రమేశ్, ఆంజనేయులు, రమేశ్ పటేల్,శివ, మధు, భరత్, యాదవ్, శ్రీకాంత్, అనిల్, వెంకట్, శేఖర్, ఇమాంపాషా, సతీశ్, గంగమల్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో దొడ్డిదారిన డిప్యుటేషన్లు!

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పాఠశాల విద్యాశాఖలో మళ్లీ డిప్యుటేషన్లు తెరపైకి వచ్చాయి. కొందరికి దొడ్డిదారిన డిప్యుటేషన్లు ఇచ్చినట్టు తెలుస్తున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత డిప్యుటేషన్లు రద్దుచేసింది. ఏమైనా ప్రత్యేక కారణాలు ఉంటేనే ఇస్తామని ప్రకటించింది. ఇందుకు నలుగురు ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటుచేసింది. దరఖాస్తులు స్వీకరించి వాటిని కమిటీ పరిశీలించి డిప్యుటేషన్లు ఇస్తుందని వెల్లడించింది. వీటిని పక్కన పెట్టి మంగళవారం డిప్యుటేషన్ల పేరుతో వివిధ జిల్లాల నుంచి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు, అదే జిల్లాలోని ఒక పాఠశాల నుంచి మరొక పాఠశాలకు ఉపాధ్యాయులను బదిలీ చేస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు ఇవ్వడం వివాదాస్పదమైంది. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలోనే కొందరికి దొడ్డిదారిన డిప్యుటేషన్లు ఇచ్చినట్టు సమాచారం.

పోలీస్ కానిస్టేబుళ్లకు పాత విధానంలో సెలవులివ్వాలి

- కుటుంబాలకు దూరం చేయాలనుకోవడం సరికాదు
- టీఎస్ఎస్పీలో నెలకో లీవ్ మ్యాన్‌వల్ దుర్మార్గం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, అక్టోబరు 15 (నమస్తే తెలంగాణ): పోలీస్ కానిస్టేబుళ్లకు పాత విధానంలోనే సెలవులు ఇవ్వాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కానిస్టేబుళ్లను వారాలపాటు కుటుంబాలకు దూరం చేయాలనుకోవడం సరికాదని మంగళవారం ఎక్స్ వేదికగా కోరారు. టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లు 15 రోజులకు ఒకసారి బదులు నెలకు ఒకసారి ఇంటికి వెళ్లేలా లీవ్ మ్యానువల్ మార్చడం దుర్మార్గమని, ఈ నూతన విధానాన్ని వెనక్కి తీసుకొని, ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. ప్రభుత్వం వారికిచ్చిన దసరా, దీపావళి కానుకా ఇది.. అంటూ ఎద్దేవా చేశారు. పోలీస్ కానిస్టేబుళ్ల శ్రమదోపిడీ గురించి ప్రతిపక్షంలో ఉండగా అసెంబ్లీలో మాట్లాడిన రేవంత్‌రెడ్డి, సీఎం అయ్యాక ఊసరవెల్లిలా మారి శ్రమదోపిడీ విధానాన్ని అమలు చేస్తున్నారంటూ మండిపడ్డారు.పెండింగ్‌లో ఉన్న టీఏ, ఎస్ఎల్, జీపీఎఫ్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుల సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ పెండింగ్ డబ్బు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సివిల్ పోలీసులు వినియోగించే వాహనాల డీజిల్ బకాయిలనూ వెంటనే విడుదల చేయాలని కోరారు.

'స్టేషన్ల నిర్వహణ' మరిచిన సర్కార్

కేసీఆర్ ప్రభుత్వం పోలీస్‌స్టేషన్ నిర్వహణకు గ్రామీణ పోలీస్‌స్టేషన్‌కు రూ.25 వేలు, పట్టణ స్టేషన్‌కు రూ.50 వేలు, హైదరాబాద్‌లో అయితే రూ.75 వేలు ఇచ్చేదని హరీశ్‌రావు గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పోలీస్‌స్టేషన్ నిర్వహణ కోసం నిధులు విడుదల చేయడమే మరిచిందని విమర్శించారు. ఇప్పటికైనా కండ్లు తెరిచి పోలీస్‌స్టేషన్ల నిర్వహణ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కిస్తీలు కట్టలేం!

- దీర్ఘకాలిక రుణాలు తీసుకుంటేనే వెసులుబాటు
- నీటిపారుదల శాఖ అధికారులకు మంత్రి ఉత్తమ్ సూచన

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ):కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు, మిత్తీల భారాన్ని తగ్గించుకొని, భవిష్యత్తులో ఏర్పడే ప్రభుత్వాలపై రుణభారాన్ని మోపేందుకు సిద్ధమైంది. ఈ మేరకు నీటిపారుదల రంగంలో ప్రస్తుత అప్పులను దీర్ఘకాలిక రుణాలుగా మార్చాలని ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. స్వల్పకాలిక రుణాలతో రాష్ట్ర ఖజానాపై భారం పడుతున్నదని, దీర్ఘకాలిక రుణాలతో ఈఎంఐతో పాటు వడ్డీ చెల్లింపుల్లో వెసులుబాటు లభిస్తున్నదని చెప్పారు.అందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. మంగళవారం జలసౌధలోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ ప్రతినిధులతో భేటీ అయ్యారు. నీటిపారుదల శాఖకు ప్రస్తుతం ఉన్న స్వల్ప కాలిక రుణాలను దీర్ఘకాలిక రుణాలుగా మార్చడం ద్వారా ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గుతుందని తెలిపారు. ఆన్ గోయింగ్ ప్రాజెక్ట్‌లకు కొత్త విధానం వర్తింపజేయాలని బ్యాంక్ ప్రతినిధులకు మంత్రి సూచించారు.

కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్,కార్యదర్శి రాహుల్ బొజ్జ, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీపన్ పాటిల్, ఈఎన్సీలు అనిల్ కుమార్, నాగేందర్ రావు, డిప్యూటీ ఈఎన్సీ కే శ్రీనివాస్, బ్యాంక్ ప్రతినిధులు సంగ్మా కిమ్, రాజేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: గుండాయిపేట సబ్‌స్టేషన్‌లో బూస్టర్‌ను ఏర్పాటు చేస్తున్న అధికారులు

గుండాయిపేట సబ్ స్టేషన్‌లో బూస్టర్ ఏర్పాటు

- 'కర్షకుల కన్నెర్ర'కు స్పందించిన అధికారులు

నమస్తే ఎఫెక్ట్

కౌటాల, అక్టోబర్ 15: కరెంట్ కోతలతో మిర్చి పంట ఎండిపోతున్నదని సోమవారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల లోని సబ్‌స్టేషన్ ఎదుట రైతులు ధర్నా చేశారు. ఈ మేరకు 'నమస్తే తెలంగాణ దినపత్రిక' మెయిన్‌లో మంగళవారం 'కర్షకుల కన్నెర్ర' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు సంబంధిత అధికారులు స్పందించి కౌటాల సబ్ డివిజన్ ఏడీఈ రాజేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం గుండాయిపేట సబ్‌స్టేషన్‌లో బూస్టర్ ఏర్పాటు చేశారు. అనంతరం ఏడీఈ రాజేశ్వర్ మాట్లాడుతూ.. బూస్టర్ ఏర్పాటుతో గుండాయిపేట సబ్‌స్టేషన్ పరిధిలో నెలకొన్న లో ఓల్టేజీ సమస్య తీరుతుందని తెలిపారు. 33 కేవీ లైన్ ఈస్‌గాం నుంచి రావడం వల్ల దూరం పెరిగిందని, కెపాసిటీకి మించి వినియోగం వల్ల లో ఓల్టేజీ సమస్య తలెత్తుతున్నదని పేర్కొన్నారు. 132 సబ్‌స్టేషన్ పనులు జరుగుతున్నాయని, అది పూర్తయితే ఎలాంటి విద్యుత్తు సమస్యలుండవని చెప్పారు. ఆయన వెంట ఎంఆర్టీ ఏడీఈ శ్రీనివాస్, కన్‌స్ట్రక్షన్ ఏడీఈ డీ శ్రీనివాస్, ఎంఆర్టీ ఏఏఈ ప్రణవి, ఆపరేషన్ ఏఏఈ రవీందర్, ఎల్ఐలు మాధవ్, రమేశ్, ప్రవీణ్, ఎల్ఎం చరణ్‌దాస్, విద్యుత్తు సిబ్బంది ఉన్నారు. కరెంటు సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'నమస్తేతెలంగాణ'కు అన్నదాతలు కృతజ్ఞతలు తెలిపారు.

సొంత రాష్ట్రాలకు వెళ్లాల్సిందే

మొదటిపేజీ తరువాయి...

ఈ నెల 9న జారీచేసిన ఉత్తర్వులపై ఐఏఎస్ అధికారులు వాకాటి కరుణ, కే ఆమ్రపాలి, ఏ వాణీ ప్రసాద్, డీ రొనాల్డ్‌రాస్, జీ సృజన, హరి కిరణ్, శివశంకర్ క్యాట్‌లో పిటిషన్లు దాఖలు చేశారు. వాటిపై క్యాట్ సభ్యులు లతా బస్వరాజ్ పట్నే, శాలినీ మిశ్రాతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఇరుపక్షాల వాదనలు సుదీర్ఘంగా జరిగాయి. ఆ తర్వాత కేంద్రం జారీచేసిన ఆదేశాల అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని క్యాట్ తేల్చి చెప్పింది. 'రాష్ట్ర విభజన నేపథ్యంలో అఖిత భారత సర్వీసు ఉద్యోగుల విభజనకు రూపొందించిన మార్గదర్శకాలు కొంత మంది అధికారులకు ఇబ్బంది కావచ్చు. అంత మాత్రాన అధికారుల సర్దుబాటు తప్పదు. ప్రజాప్రయోజనాలు, అధికారుల సేవలను వినియోగించుకోవాలనే ఉద్దేశంతో కేంద్రం వాళ్లను ఆయా రాష్ట్రాలకు కేటాయించింది. ఈ పరిస్థితుల్లో కేంద్ర ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు ఆస్కారం లేదు. కాబట్టి ఏవిధమైన మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం లేదు' అని క్యాట్ ఆదేశాల్లో పేర్కొంది. క్యాట్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో పలువురు ఐఏఎస్ అధికారులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. క్యాట్ ఉత్తర్వులపై బుధవారం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయనున్నట్టు కొందరు అధికారులు వెల్లడించారు.

త్వరలో ఐపీఎస్‌ల బదిలీలు?

తెలంగాణలో మరోసారి ఐపీఎస్‌ల బదిలీలు జరుగనున్నట్టు తెలిసింది. హైదరాబాద్‌తోపాటు, రాష్ట్రంలోని మరికొందరు ఐపీఎస్‌లకు స్థానచలనం తప్పదని పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ముఖ్యంగా అవినీతి పనుల్లో తలదూర్చుతున్న ఐపీఎస్‌లను పూర్తిగా నాన్‌ఫోకల్ పోస్టుల్లో వేస్తారనే చర్చ జోరందుకున్నది. తాజాగా జరగబోయే బదిలీల్లో డజను మంది సీనియర్ నుంచి జూనియర్‌స్థాయి ఐపీఎస్‌లు ఉంటారని తెలిసింది.

క్యాట్‌కు వెళ్లి తప్పు చేశామా?: పలువురు అధికారుల అంతర్మథనం

డీవోపీటీ ఆదేశాలపై క్యాట్‌ను ఆశ్రయించి తప్పు చేశామా? అని పలువురు అధికారులు భావిస్తున్నట్టు సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. వాస్తవానికి డీవోపీటీ ఆదేశాల తర్వాత రాజకీయ ప్రక్రియ ద్వారా తమ బదిలీని వాయిదా వేయించాలని అధికారులు భావించారట. కానీ రాష్ట్ర ప్రభుత్వంలోని ఓ ముఖ్య నేత కొందరు ఐఏఎస్ అధికారులను పిలిచి క్యాట్‌ను ఆశ్రయించాలని సూచించినట్టు సమాచారం. హైకోర్టు ఆదేశాల మేరకే డీవోపీటీ ఈ నిర్ణయం తీసుకున్నది కాబట్టి క్యాట్‌ను ఆశ్రయించినా ఫలితం ఉండకపోవచ్చని కొందరు అధికారులు అభిప్రాయపడ్డారట. కానీ ఆ నేత మాత్రం 'రాజకీయంగా ప్రభుత్వ సాయం అందించే పరిస్థితి లేదు. కాబట్టి క్యాట్‌ను ఆశ్రయించండి' అంటూ ఒత్తిడి చేసినట్టు చెప్పుకుంటున్నారు. కానీ ఇప్పుడు వ్యతిరేకంగా ఆదేశాలు రావడంతో అంతర్మథనం చెందుతున్నారట. అనవసరంగా ఆ నేత మాటలు విన్నామని.. క్యాట్‌ను ఆశ్రయించడం ద్వారా డీవోపీటీకి వ్యతిరేకంగా వెళ్తున్నామనే భావన కల్పించినట్టు అయ్యిందని, అవసరంగా చర్చల్లో నిలిచామని సన్నిహితుల దగ్గర ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. ఈ పరిస్థితుల్లో హైకోర్టును ఆశ్రయించినా అనుకూల ఫలితం వచ్చే అవకాశాలు తక్కువేనని చెప్పుకుంటున్నారట. అటు పరువు పోవడంతోపాటు ఇటు ఏపీకి వెళ్లక తప్పడం లేదని వాపోతున్నారని సచివాలయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

కాంగ్రెస్-బీజేపీ అలయ్ బలయ్

మొదటిపేజీ తరువాయి...

ప్రారంభించేందుకు కలిసి వెళ్లారు. ఈ పరిణామాలపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. మంత్రులో, అధికారులో వెళ్తే సరిపోయేదానికి సీఎం స్వయంగా వెళ్లి ఎదుర్కోవడం వెనుక మర్మమేంటనేది సోషల్ మీడియాలోనూ చర్చనీయాంశమైంది. బీజేపీ-కాంగ్రెస్ మధ్య స్నేహబంధానికి ఇది నిదర్శనమని పలువురు విశ్లేషిస్తున్నారు.

ఈ స్నేహం మర్మమేంటో?

కాంగ్రెస్ ప్రభుత్వంపై మొదటి నుంచి రాష్ట్ర బీజేపీ నేతలు సాఫ్ట్ కార్నర్‌తో ఉన్నారనే చర్చ జరుగుతున్నది. రాష్ట్రంలో ఎన్ని సమస్యలు ఉన్నా, ప్రభుత్వంపై ఎన్ని ఆరోపణలు వచ్చినా బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మినహా బీజేపీ నేతలెవరూ పల్లెత్తు మాట కూడా అనకపోవడమే ఇందుకు ఉదాహరణ అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాని మోదీని సీఎం రేవంత్‌రెడ్డి 'బడే భాయ్' అని సంబోధించినప్పుడే ఆ స్నేహం బయటపడిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. హైడ్రా, మూసీ ఆక్రమణల పేరుతో ప్రభుత్వం హైదరాబాద్‌లో పేదల ఇండ్లు కూలగొడుతున్నా 40 మందికి పైగా కార్పొరేటర్లు ఉన్నా బీజేపీ పట్టించుకోని వైనాన్ని లేవనెత్తుతున్నారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా రేవంత్ సర్కారు తీరును నిలదీయకపోవడానికి కారణం ఈ స్నేహమే అని అభిప్రాయపడుతున్నారు. పైగా ఆ పార్టీ ఎంపీ రఘునందన్ రావు హైడ్రాకు మద్దతు పలికారని గుర్తు చేస్తున్నారు. ప్రజలే కాంగ్రెస్ సర్కారు తీరుపై గొంతెత్తుతున్నా బీజేపీ నేతలకు మాత్రం వినిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ముత్యాలమ్మ గుడి విషయంలో బీజేపీ సహజ వైఖరికి భిన్నంగా వ్యవహరిస్తున్నదనే చర్చ జరుగుతున్నది. ఇలాంటి మతపరమైన అంశాలు తలత్తినప్పుడు బీజేపీ నేతలు గొంతుచించుకొని వ్యవహరిస్తుంటారని, ఇప్పుడు మాత్రం నామమాత్రంగా స్పందిస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి కావాల్సినప్పుడు కేంద్ర పెద్దల అపాయింట్‌మెంట్లు ఖరారు కావడం, గంటల తరబడి ఏకాంత చర్చలు సాగించడం వెనుకా ఇదే స్నేహం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎక్సైజ్ X కమర్షియల్ ట్యాక్స్

రెండు ప్రభుత్వ శాఖల మధ్య ప్ర